

దత్తన్నకు రక్షాబంధనం!

సుప్రసిద్ధ దత్త క్షేత్రం పిఠాపురంలో ఆ స్వామికి పలువురు భక్తులు శనివారం రక్షాబంధనం కట్టి, తమ భక్తిని చాటుకున్నారు.



రక్షాబంధనం వేళ.. వీడిన పాశాలు

గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. వారిలో ఒకరి మరణ వార్త విని అతడి తండ్రి గుండెపోటుతో మృతి చెందారు.

8లో

సముద్రంలోకి 1.17 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 1,17,571 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,700, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి మొత్తం 14,400 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.80 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

బాలబాలాజీకి రూ.3.4 లక్షల వెండి వస్తువుల సమర్పణ



వెండి వస్తువులు అందజేస్తున్న దాత పాండురంగరాజు దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారికి మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన ముదునూరి పాండురంగరాజు, రాణి దంపతులు రూ.3.4 లక్షల విలువైన మూడు కిలోల వెండి వస్తువులను శనివారం సమర్పించారు. దేవాలయంలో నిత్య కైంకర్యాల కోసం వెండి బిందె, వెండి పళ్లెం, రెండు వెండి దీపం కుందులను వారు అందజేశారు. వాటికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం అర్చకులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ ఈఓ వి.సత్యనారాయణ అభినందించారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలి

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రాజోలు: రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. కడలి గ్రామంలో మిరాకిల్ చర్చిలో కోనసీమ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ కోనసీమ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఎలా బలోపేతం చేశారో అలాగే వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ నెల 12వ తేదీన కడలి గ్రామంలో జరిగే బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెల్ అధ్యక్షురాలు ఈద సంధ్య కోరారు. బిషప్ శరత్‌భూషణ్ వందన సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని భక్తులు శనైశ్చరా శరణు.. శరణు అంటూ వేనోళ్ల కొలిచారు. శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ దారపు రెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,28,585 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.17,808 రాగా మొత్తం 1,46,393 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

శనైశ్చరుని దర్శించుకున్న సీఐడీ డీఐజీ

ఏపీ సీఐడీ డీఐజీ రవిశంకర్ అయ్యర్, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ మధుసూధనరావు మందపల్లి క్షేత్రాన్ని సందర్శించి శనైశ్చరస్వామి వారికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకం, శాంతి హోమం జరిపించారు.

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల రద్దీ

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామివారికి రూ.3,10,502 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు.. సుమారు 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామివారిని సీఆర్‌డీఏ కమిషనర్ కూనపురెడ్డి కన్నబాబు దంపతులు దర్శించుకున్నారు.

శ్రుతి తప్పిన రుతురాగం

నింగికీ నేలకీ ఉమ్మడి అతిథులు మేఘమాలలు. భూమ్యాకాశాల పలకరింపులు బాగున్నపుడు ఉబ్బి తబ్బిబ్బై ఎంతో ఆర్ద్రతతో చక్కని చిరునవ్వులు చిందిస్తూ చిటపటమంటూ చినుకులను చిమ్మేస్తాయి. అచ్చు మన ఇంటికి వచ్చిన అతిథులకు మనం ఇచ్చే ఆతిథ్యం నచ్చినపుడు ఎంతో సంతోషంతో సుఖీభవ అని ఆశీర్వదించి సెలవు తీసుకున్నట్టు. అదే ఏ మనస్పర్థలో వచ్చి ఆ ఇంటి వారు ఎడమొహం పెడమొహంగా ఉంటే ఏ అతిథైనా ఎప్పుడు వెళ్లిపోదామా అని ఎదురుచూస్తుంటాడు. ఇదే వాతావరణం భూమ్యాకాశాలు, మేఘమాలల మధ్య సాగుతోంది. రుతు గమనాలు మారిపోవడం.. భూగతులు క్రమం తప్పడం.. ఇందుకు పుడమి పుత్రులు చాలా వరకు కారణం కావడం.. వగైరా వగైరా. బిడ్డలకు క్రమశిక్షణ నేర్పాలనుకుంటున్నాయో ఏమో.. సకాలంలో మేఘాలు వర్షించక.. వర్షించిన కాలం పంటలకు అకాలమై నిలదొక్కుకోలేక.. అసలు ఏం జరుగుతోందో తెలియని అయోమయ స్థితిలో ఆకాశంవైపు చూస్తున్నాడు అన్నదాత. నీ తప్పిదానికి నాది బాధ్యత కాదన్నట్టు మేఘాలు ముఖం చాటేస్తున్నాయి. ఫలితంగా సాగులో అస్థిరత ఏర్పడుతోంది.

- ఉమ్మడి 'తూర్పు'పై నైరుతి శీతకన్ను
- 48 మండలాల్లో లోటు వర్షపాతం
- ఖరీఫ్‌కు అడుగడుగునా అవాంతరం
- 5.97 లక్షల ఎకరాల ఆయకట్టులో 4.56 లక్షల ఎకరాల్లోనే సాగు
- గోదారి నీటి రాక సైతం అరకొర
- గత ఏడాది ఈ సమయానికి 1,895 టీఎంసీల ఇన్‌ఫ్లో
- ఈ ఏడాది వచ్చింది 937.420 టీఎంసీలే

సాక్షి, అమలాపురం: నైరుతి రుతుపవనాలు రాకుండానే.. మే నెలలో.. మండు వేసవిలో జోరుగా వర్షాలు కురిశాయి. ఆలస్యంగా వచ్చిన రుతుపవనాలతో భారీ వర్షాలు కురుస్తాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్నదాతలు, ప్రజలు ఆశించారు. కానీ అడపాదడపా తప్ప వాన జాడ లేదు. గోదావరికి జూలై నెలలో అరుదుగా వరద వస్తుంది. ఇలా వచ్చిన ఏడాది.. ఆ తరువాత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరదలు రావడం పరిపాటి. గత ఏడాది లాగే ఈసారి కూడా జూలైలో గోదావరికి రెండుసార్లు వరద పోటు తగిలినా పెద్దగా ఇన్‌ఫ్లో లేకుండా పోయింది. పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో గోదావరిలో నీటి ఉరవడి తగ్గిపోయింది. ఇక రైతుల ఆశల పంట ఖరీఫ్ మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంది. గోదావరి డెల్టాలోనే నీరందడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు. నైరుతి రుతు పవనాలు ముఖం చాటేశాయి. అప్పుడప్పుడు తప్ప ఉమ్మడి జిల్లాలో వర్షం జాడే దాదాపు లేకుండా పోయింది. జూన్, జూలై నెలలతో పాటు ఆగస్టు నెలలో ఇప్పటి వరకూ లోటు వర్షపాతం నమోదైంది. వారంలో ఒక రోజు ఒక మోస్తరు వర్షం కురిస్తే మిగిలిన ఆరు రోజులూ వేసవిని తలపించేలా ఎండలు ఠారెత్తిస్తున్నాయి.



కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గొల్లప్రోలులో ఏలేరు పరిధిలో సాగు చేయని వరిచేలు (అంతరచిత్రం) కాజులూరు మండలం బందనపూడిలో డెల్టా కాలువల ద్వారా నీరందక, మరోవైపు వర్షాలు లేక బీడువారిన వరిచేలు

ఉష్ణోగ్రతల ధాటికి సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 32 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

అరకొరగానే గోదావరి నీరు..

ఈ ఏడాది గోదావరి ఇన్‌ఫ్లో కూడా అంతంత మాత్రమే ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇన్‌ఫ్లో సగం కూడా లేదు. గత ఏడాది ఆగస్టు 9వ తేదీ నాటికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో 1,895.571 టీఎంసీలుగా నమోదైంది. ఆ సమయానికి డెల్టాలోని మూడు ప్రధాన కాలువలకు 47.465 టీఎంసీలు నీరు విడుదల చేయగా సముద్రంలోకి 1,848.106 టీఎంసీల మిగులు జలాలను విడిచిపెట్టారు. అదే రోజు మూడు డెల్టా కాలువలకు 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, సముద్రంలోకి 7,33,886 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

కానీ, ఈ సంవత్సరం ఇప్పటి వరకూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 937.420 టీఎంసీల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైంది. దీనిలో 61.33 టీఎంసీలు పంట కాలువలకు విడుదల చేయగా 876.087 టీఎంసీలు సముద్రంలోకి విడిచిపెట్టారు. ప్రస్తుతం పంట కాలువలకు 14,700 క్యూసెక్కుల నీటిని వదులుతూండగా 1,18,480 క్యూసెక్కులు మాత్రమే సముద్రంలోకి వదులుతున్నారు. గత ఏడాది జులై నెలలో భారీ వరద చోటు చేసుకోగా తిరిగి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనూ గోదావరికి పెద్ద వరదలు వచ్చాయి. ఇన్‌ఫ్లో ఆశాజనకంగా ఉండటంతో గత ఏడాది రబీకి ఢోకా లేకుండా పోయింది. కానీ, ఈ ఏడాది జూలై నెలలో గోదావరికి రెండుసార్లు మాత్రమే స్వల్పంగా వరద వచ్చింది. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే రబీకి నీటి ఎద్దడి తప్పదనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

మందకొడిగా ఖరీఫ్

కోనసీమతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ నత్తనడకన సాగుతోంది. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలలో మొత్తం 5,97,847 ఎకరాలలో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,56,067 ఎకరాలలో మాత్రమే నాట్లు పడడం గమనార్హం. అంటే మొత్తం సాగులో 76 శాతం మాత్రమే నాట్లు పడ్డాయి. కోనసీమ జిల్లాలో 1,63,999 ఎకరాలకు 1,23,117 ఎకరాల్లో (70 శాతం) నాట్లు పడగా, తూర్పుగోదావరి జిల్లాలో 1,99,867 ఎకరాలకు 1,74,638 ఎకరాలలో (87 శాతం), కాకినాడ జిల్లాలో 2,33,981 ఎకరాలకు 1,58,312 ఎకరాలు (67 శాతం) మాత్రమే నాట్లు వేశారు. కాకినాడ జిల్లాలో ఏలేరు, పంపా, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)తోపాటు పలు ప్రాంతాల్లో ఖరీఫ్ మందకొడిగా సాగుతోంది.

48 మండలాల్లో వర్షాభావం

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు **నెలకొన్నాయి**. మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు **లోటు వర్ష**మే కురిసింది. తూర్పు గోదావరి **జిల్లాలో న**గటు కన్నా 22.65 మిల్లీ మీటర్లు, కాకి**నాడ జిల్లాలో** 22.19 మిల్లీ మీటర్లు, కోనసీమ **జిల్లాలో** 32.75 మిల్లీమీటర్ల వర్షం పాతం తక్కు**వగా నమోదైం**ది. ఈ ఏడాది కోనసీమలో పరిస్థితి **మరీ దారుణం**గా ఉంది. అడపాదడపా వర్షాలు **పడుతున్నా** భారీ వర్షానికి జిల్లా వాసులు ముఖం **వాచేలా** ఎదురుచూస్తున్నారు. ఇక మొత్తం మూడు జిల్లాల్లో 62 మండలాలు ఉండగా, ఏకంగా 48 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీనిలో తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలు ఉండగా, 13 మండలాల్లో లోటు వర్షం పడింది. కాకినాడ జిల్లా 21 మండలాలకు 14 మండలాల్లో లోటు వర్షం కురవగా, కోనసీమ జిల్లాలో 22 మండలాలకు ఏకంగా 21 మండలాల్లో వర్షాభావం నెలకొంది. కోనసీమ జిల్లాలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. రెండు మూడేళ్లుగా ఒక్క ఆగస్టు మినహా జూన్ నుంచి అక్టోబరు నెల వరకు సగటు కన్నా అధిక వర్షం నమోదు కావడం గమనార్హం.

మానవ విధ్వంసం వల్లే



వర్షాలను ఆకర్షించే ఎన్నో వనరులు ఆక్వా చెరువుల వల్ల ప్రభావితమవుతున్నాయి. నైరుతి నుంచి వాయవ్యంగా రావాల్సిన మేఘాలు ఇటీవల కాలంలో ఆగ్నేయంగా పయనిస్తున్నాయి. దీనివల్ల ఒక ప్రాంతంలో భారీ వర్షం కురవడం, ఆ పక్కనే ఉన్న ప్రాంతంలో వర్షం కురకపోవడం జరుగుతోంది. రోహిణీ కార్తెలో వర్షాలు పడటం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీనివల్ల భారీ వర్షాలు కురిసే మేఘాలు ఏర్పడటం లేదు. ఈ కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవాలంటే సముద్ర ఉష్ణోగ్రతల్లో సమతుల్యత ఉండాలి. మానవ విధ్వంసం వల్ల ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. దీనివల్ల కూడా రుతుపవనాలకు అనుకూల వాతావరణం ఏర్పడటం లేదు.

– డాక్టర్ పి.కృష్ణకిశోర్, కోనసీమ సాగర, పర్యావరణ పరిశోధకుడు, అమలాపురం



తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఇప్పటికీ నాట్లు పడని వరిచేలు



కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద లేక తేలుతున్న దిబ్బలు

ఘనంగా శ్రావణ పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ, జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామాలతో అర్చన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం పీఠంలోని భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.



సర్వాభరణ భూషితురాలైన విజయదుర్గా అమ్మవారు

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ, ధర్మదాయ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు డిప్యూటీ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు శనివారం తెలిపారు. 13 మంది సభ్యుల నియమకానికి హిందూ మతానికి చెంది ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను దేవస్థానం కార్యాలయంలో 20 రోజుల్లోగా అందజేయాలని కోరారు. కార్యాలయం పని వేళల్లో దరఖాస్తులు పొందవచ్చని, మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

వాడవాడల నుంచి వాడపల్లికి..

- వేలాదిగా భక్తజనం రాక
- స్వామివారి ఆదాయం రూ.50.35 లక్షలు

కొత్తపేట: కోనసీమ తిరుమల.. ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్రం శనివారం వేలాది మంది భక్తజనంతో కిటకిటలాడింది. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు, వేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశాక కోరిన కోర్కెలు తీరిన అనేకమంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కాలినడకన వచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు రావడంతో క్యూలైన్లు నిండిపోయాయి.



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తజనం

స్వామికి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకస్వాముల నుంచి ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రాంగణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకూ వివిధ మార్గాల ద్వారా దేవస్థానానికి రూ.50,35,081 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ రాము, వాడపల్లిలో ట్రాఫిక్ నియంత్రించి ఆలయం ఆవరణలో శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లికి బస్సు సర్వీసులను నడిపింది.

ఒక్క రూమ్ ప్లీజ్

- రత్నగిరిపై జోరుగా పెళ్లిళ్ల సందడి
- 70 శాతం సత్రాల గదులన్నీ వివాహ బృందాలకు రిజర్వ్
- మిగిలిన రూముల కోసం వీఐపీల సిఫారసులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

అన్నవరం: వివాహ సందడితో రత్నగిరి రద్దీగా మారింది. సత్యదేవుని సన్నిధిన శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. రత్నగిరిపై ఆదివారం, ఈ నెల 17న పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. రత్నగిరిపై దాదాపు 600 వసతి గదులుండగా వీటిలో 70 శాతం ఈ ముహూర్తాలకు రిజర్వ్ అయిపోయాయి. వాటికి సంబంధించిన చార్జులు కూడా సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో మిగిలిన సత్రం గదుల కోసం కూడా వీఐపీల నుంచి పెద్ద ఎత్తున సిఫారసులు వస్తూండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒక్క రూమ్ ప్లీజ్ అంటూ పెళ్లి బృందాలు, భక్తులు వెంట పడుతూండటంతో దిక్కు తోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఇతర భక్తులు కూడా పెద్ద సంఖ్యలో వస్తూండటంతో వారికి వసతి గదులు కేటాయించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ వరకూ వసతి గదుల కేటాయింపునకు ముగ్గురు సూపరింటెండెంట్లతో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. వారు వీఐపీల సిఫారసులు, రిజర్వేషన్, ఖాళీలు, ఇతర వివరాలు పరిశీలించి గదులు కేటాయిస్తారు.

శ్రావణం.. పెళ్లిళ్ల సంరంభం :

శుభప్రదమైన శ్రావణ మాసం ప్రారంభమైనప్పటి నుంచీ ప్రతి రోజూ కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులు సత్యదేవుని సన్నిధికి పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ శ్రావణంలో సత్యదేవుని సన్నిధిలో ఇప్పటికే 200కు పైగా వివాహాలు జరిగాయి. గత నెల 25వ తేదీన శ్రావణ మాసం ప్రారంభం కాగా 26 నుంచి వివాహాలు మొదలయ్యాయి. ఇప్పటి వరకూ ఒక్కో ముహూర్తంలో 40 నుంచి 50 వివాహాలు జరిగాయి. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై 100 వివాహాలు జరగనున్నాయి. ఈ నెల 17వ తేదీ వరకూ రత్నగిరిపై అధిక సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ప్రధానంగా 10, 11, 13, 14, 15, 17 తేదీల్లో రత్నగిరిపై సత్రం గదుల్లో దాదాపు 70 శాతం, వివాహ మండపాలన్నింటినీ పెళ్లి బృందాలు గత నెలలోనే రిజర్వ్ చేసుకున్నాయి. ఆ ముహూర్తాల్లో ఆలస్యంగా వివాహాలు నిర్ణయించుకున్న పెళ్లి బృందాల వారు గదులు, వివాహ మండపాలు లభ్యం కాక ఇబ్బంది పడుతున్నారు. మొత్తం మీద ఈ వివాహాలన్నీ ఏ వివాదాలూ లేకుండా సజావుగా జరిగితే అదే పదివేలనుకునే పరిస్థితి దేవస్థానంలో నెలకొంది.

సత్యదేవుని దర్శించిన 50 వేల మంది

శ్రావణ పౌర్ణమి పర్వదినం, రెండో శనివారం సెలవు కావడంతో రత్నగిరికి భక్తులు వెల్లువలా తరలి వచ్చారు. సుమారు 50 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. భక్తులు, నవదంపతులతో వ్రత మండపాలు కిక్కిరిసిపోయాయి. రూ.2 వేల వ్రత మండపాలు చాలకపోవడంతో భక్తులు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి తిరుచ్చి వాహనంపై ఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఆదివారం ఉదయం 10 గంటల నుంచి టేకు రథంపై ఊరేగిస్తారు. రూ.2,500 టికెట్టుతో ఈ రథ సేవలో భక్తులు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

లక్షణంగా అలంకరణ

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని.. రంగురంగుల గాజులనే దండలుగా రూపొందించి.. అమ్మవారికి అలంకరించి భక్తులు మురిసిపోయారు. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా లక్ష గాజులతో తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి శనివారం ఈ అలంకరణ చేశారు. కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ, గాజుల పూజ ద్వారా కార్య, సౌభాగ్య సిద్ధి కలుగుతాయని అర్చకుడు కాళ్లకూరి సాయి సూర్య సుబ్రహ్మణ్య శర్మ అన్నారు.

– తాళ్లపూడి



బ్యాటరీ కారు బహూకరణ

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం కత్తెర శ్రీనివాసరావు, వైజయంతి దంపతులు, కుమారుడు కేశవానంద్ (హైదరాబాద్) రూ.10 లక్షల విలువైన బ్యాటరీ కారును శనివారం అందజేశారు. తన తండ్రి రామారావు జ్ఞాపకార్థం దీనిని బహూకరిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. కారు తాళాలను ఈఓ సుబ్బారావుకు అందజేశారు.



బ్యాటరీ కారు తాళాలను ఈఓకు అందజేస్తున్న దాత

క్లుప్తంగా

పెట్రోల్ బంకులో వాహనానికి మంటలు

అయినవిల్లి: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకులో శనివారం ఎక్సెల్ మోటార్ సైకిల్‌కు పెట్రోలు కొడుతుండగా అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో పెట్రోల్ బంకు సిబ్బంది హుటాహుటిన మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలోను ఇలా చాలాసార్లు మంటల వ్యాపించాయని పెట్రోలు బంకు సిబ్బంది తెలిపారు. తరచు ఇలా ప్రమాదాలు సంభవించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. బంకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంపీటీసీ ఇంట్లో చోరీ

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడి ఇంట్లో శనివారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పడి రెండు కాసులు బంగారు వస్తువులు, రూ.70 వేల నగదు చోరీ చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సీ తెలిపారు.


శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి ప్రత్యేక పూజల్లో భక్తులు


శ్రీపాద శ్రీవల్లభ స్వామికి కన్యాకాపరమేశ్వరి అమ్మవారు తెచ్చిన రాఖీని భక్తులకు చూపుతున్న అర్చకులు


శ్రీపాద శ్రీవల్లభ స్వామికి రాఖీలు కట్టేందుకు తరలివస్తున్న మరాఠీ భక్తులు


శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారికి రాఖీ కడుతున్న భక్తురాలు

దత్తన్నకు రక్షాబంధనం!

- దత్తాత్రేయునికి రాఖీకట్టిన వాసవీ కన్యకా పరమేశ్వరి
- అమ్మవారి తరఫున రక్షా బంధనాలు కట్టిన మహారాష్ట్ర మహిళలు
- 30 వేల మంది భక్తుల రాక
- ఘనంగా రాఖీ పౌర్ణమి ఉత్సవాలు
- కిటకిటలాడిన శ్రీపాద, శ్రీవల్లభ క్షేత్రం


పిఠాపురం: దత్తాత్రేయుని అవతారంగా భక్తులు భావించే శ్రీపాద శ్రీవల్లభస్వామి జన్మస్థలమైన పిఠాపురంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వేలాది భక్తుల రాకతో దత్తాత్రేయుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి రాఖీలు కట్టడం ఇక్కడ ఆనవాయితీ. ఈ ఏడాది సుమారు 30 వేల మంది వరకు మహారాష్ట్ర భక్తులు తరలిరావడంతో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్తులు, అర్చకులు స్వామివారికి రక్షాబంధనాలు కట్టారు.


వైభవంగా లక్ష మల్లెలతో అర్చన

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం, స్వయంభూ దత్తాత్రేయ స్వామివారికి ఆలయ అర్చకులు కోట ఫణిశర్మ రుత్విక్కులు లక్ష మల్లెలతో వైభవంగా అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీ వల్లభునికి రాఖీ అందజేసిన వాసవి అమ్మవారు

రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానానికి శ్రీ పాదులవారికి సోదరి వాసవీ కన్యకా పరమేశ్వరి రాఖీ కట్టడం ఇక్కడ ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం పిఠాపురంలో కొలువైన వాసవి కన్యకపరమేశ్వరి దేవాలయం నుంచి శ్రీపాద సంస్థానం వరకు గ్రామోత్సవంగా వెళ్లి భక్తులు అమ్మవారి తరపున స్వామివారికి రక్షాబంధన్, పట్టు వస్త్రాలు సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు


పాదగయ శ్రీకుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న దత్తాత్రేయ స్వామి వారికి లక్ష మల్లెల పూజ

కూలిపనికి వెళ్తుండగా మృత్యు ఒడిలోకి..

లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలం సీతంపేట రంగా విగ్రహం సెంటర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పెరవలి మండలం కానూరు అగ్రహారానికి చెందిన దవులూరి సుబ్రహ్మణ్యం (44), లంకే ప్రసాద్ (26) రోజూ మాదిరిగానే శనివారం తెల్లవారుజామున 6.30 సమయంలో కడియపులంకలో పూల కుండీల లోడింగ్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. విజ్జేశ్వరం-సీతంపేట సమీపంలోని రంగా విగ్రహం సెంటర్ వద్దకు వారు వచ్చే సరికి కొవ్వూరు వైపు వస్తున్న లారీ వెనుక నుంచి వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో వారు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సమాచారం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్ కొవ్వూరు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబాలకు చెరో రూ.10 వేలు అందించారు. ప్రభుత్వం తరపున సాయం అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



మృతి చెందిన దవులూరి సుబ్రహ్మణ్యం, లంకే ప్రసాద్

రక్షా బంధనం వేళ.. వీడిన పాశాలు..

- శుభకార్యానికి వెళ్లివస్తూ ఒకరు.. చెల్లెలికి రాఖీ కట్టి వస్తూ మరొకరు..
- ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఘటన
- కుమారుడి మృతి వార్త విని గుండెపోటుతో తండ్రి మృతి

గోపాలపురం: మండలం వెంకటాయపాలెంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడడం.. వారిలో ఒకరి మరణ వార్త విని అతడి తండ్రి గుండెపోటుకు గురై చనిపోవడంతో ఇటు గోపాలపురం మండలం వాదాలకుంట, తాళ్లపూడి మండల పెద్దేవం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన మరపట్ల సువర్ణరాజు (56) తాళ్లపూడి మండలం చిడిపిలో బంధువుల ఇంటిలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన గుండేపల్లి మణిశంకర్ (30) దేవరపల్లి మండలం యాదవోలులో ఉన్న చెల్లి వద్దకు వెళ్లి రాఖీ కట్టించుకు తిరిగి వస్తున్నాడు.


మరపట్ల సువర్ణరాజు (ఫైల్)

వారిద్దరు గోపాలపురం మండలం వెంకటాయపాలెం మలుపు వద్ద పరస్పరం ఢీకొనడంతో మణిశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న సువర్ణరాజును గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. సువర్ణరాజు వెళ్లిన శుభకార్యానికి భార్య, కుమారుడు, కుమార్తె మిగిలిన బంధువులు వెళ్లారు. తిరిగి సువర్ణరాజు ఒక్కడే మోటార్ సైకిల్ వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. వెనుక వస్తున్న భార్య కుమారుడు, కుమార్తె, బంధువులు సువర్ణరాజును ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.


సువర్ణరాజు మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న కుమారుడు


మణిశంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

డెలివరీ వ్యాన్ బోల్తా : డ్రైవర్ మృతి

తుని రూరల్: అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఫ్లిప్‌కార్ట్ డెలివరీ వ్యాన్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ జయంతి తెలిపారు. శనివారం తెల్లవారుజామున జరిగిన సంఘటన వివరాలను హెచ్‌సీ వివరించారు. యలమంచిలి నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న వ్యాన్ తుని మండలం తేటగుంట సమీపంలో సెంటర్ డివైడ్ పైకి ఎక్కి అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. వ్యాన్ డ్రైవర్ గోకాడ హరికృష్ణ (28) అక్కడికక్కడే మృతి చెందినట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదృశ్యమైన తల్లీబిడ్డల ఆచూకీ లభ్యం

జగ్గంపేట: జగ్గంపేట గ్రామానికి చెందిన ఒక వివాహిత తన కొడుకు, కూతురుతో ఈ నెల 4వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. దీనిపై జగ్గంపేట పోలీసుస్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు అయింది. ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బృందాన్ని ఏర్పాటు చేశామని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. అదృశ్యమైన వివాహిత ఆమె 10 ఏళ్ల కొడుకు, ఆరేళ్ల కుమార్తెను హైదరాబాద్‌లో గుర్తించి జగ్గంపేట తీసుకువచ్చి వారి బంధువులకు శనివారం అప్పగించినట్లు సీఐ తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీలో చోరీ

నిడదవోలు: స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లోని విజయలక్ష్మి గ్యాస్ ఏజెన్సీలో శుక్ర వారం రాత్రి దొంగ లు పడ్డారు. కార్యాల యం ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారు. కిటికీ ఊచలను పెకిలించి లోపలికి ప్రవేశించిన వారికి ఒక సొరుగులో కేవలం రూ.3 వేల నగదు తప్ప మరేమీ దక్కలేదు. ప్రొప్రయిటర్ గదిలోని లాకర్‌లో సైతం ఏమీ లేకపోవడంతో కిటికి నుంచి బయటకు వచ్చి మరో గది తాళం ఉన్న గొళ్ళాన్ని గునపంతో పెకిలించి లోపలికి ప్రవేశించారు. అక్కడా ఏమీ దొరకకపోవడంతో వెనుదిరిగారు. దొంగతనం మొత్తం సీసీ పుటేజీలో నమోదైంది. దానితో గ్యాస్ ఏజెన్సీ యజమాని సత్తి ఆదివిష్ణు పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

దోపిడీ కేసు గుట్టు రట్టు

- సెల్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు
- ఐదుగురి అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం


నిందితులను ప్రవేశపెట్టిన పోలీసులు (అంతరచిత్రం) కడ్డీలుగా మార్చిన బంగారు, వెండి వస్తువులు

పిఠాపురం: గత నెల 28న గొల్లప్రోలు మండలం చెందుర్తి రహదారిలో జరిగిన దారి దోపిడీ కేసును గొల్లప్రోలు పోలీసులు ఛేదించారు. సీఐ శ్రీనివాస్ శనివారం గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నల్లమందు వీధికి చెందిన సమీర్ ప్రజాపత్ అక్కడి భవానీ సిల్వర్స్‌లో గుమస్తాగా పనిచేస్తూ చుట్టుపక్కల ప్రాంతాల్లోని దుకాణాలకు బంగారం, వెండి వస్తువులను రవాణా చేస్తుంటాడు. విధి నిర్వహణలో భాగంగా ఆయన గత నెల 28న పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలులోని నగల దుకాణాల నుంచి బంగారం, వెండి, డబ్బులు తీసుకుని మోటార్ సైకిల్‌పై చెందుర్తి వెళ్తుండగా రాత్రి సుమారు 8 గంటల సమయంలో చెందుర్తి రోడ్డులో కల్వర్ట్ దగ్గర నలుగురు వ్యక్తులు 2 మోటార్ సైకిళ్లపై వచ్చి బ్లేడుతో బెదిరించి 51 గ్రాముల బంగారం, 12.5 కిలోల వెండి, రూ.60 వేల నగదు దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తుచేసిన పోలీసులు ఘటనాస్థలంలో సిగ్నల్స్ ఆధారంగా పెద్దాపురానికి చెందిన బంగారు నగల వర్తకుడు రౌతు గోవిందుపై నిఘా పెట్టారు. శనివారం పిఠాపురం మండలం జల్లూరు గ్రామ శివారులో అతనితో పాటు గనిరెడ్డి సాయి ప్రసాద్, కోన సాయిబాబు, బొమ్మను విజయ్ ఆనంద్, కుక్కల శివ మణికంఠ దోపిడీ చేసిన సొత్తును పంచుకుంటున్న సమయంలో గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీ చేసినట్టు అంగీకరించారు. వారి నుంచి దోచుకున్న సొత్తుతో పాటు వారు వినియోగించిన రెండు మోటారు సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కాగా గోవిందు పెద్దాపురంలో బంగారు వెండి వ్యాపారం చేస్తుంటాడు. బాధితుడైన సమీర్ అతడితో కూడా లావాదేవీలు చేస్తుంటాడు. ఈ క్రమంలో సమీర్ వద్ద అధికమొత్తంలో బంగారం, వెండి ఉంటాయని, వాటిని కొట్టేయాలన్న దుర్బుద్ధితో అతడిపై తన మనుషులతో రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం ఈ దోపిడీకి పాల్పడ్డాడని సీఐ తెలిపారు. దోపిడీ చేసిన వెండి, బంగారాన్ని కరిగించి దిమ్మలుగా మార్చి ఆనవాళ్లు లేకుండా చేశారని సీఐ తెలిపారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా జీవీఆర్‌ఎస్‌హెచ్‌కే వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, గౌరవ అధ్యక్షుడిగా సలాది సాయి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా రేపాక వెంకటరాము, ఉపాధ్యక్షుడిగా కె.కిశోర్, సంయుక్త కార్యదర్శిగా ములంపాక శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీవీఎస్ త్రినాథ్, ఉపాధ్యక్షుడిగా తనికెళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా కె.సునీత, రాష్ట్ర ప్రతినిధిగా డొక్కా రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబి, ఆలీ, రంగారావు, పి.వేంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, చార్లెస్, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు

- 3 రోజుల పాటు నిర్వహణ
- తలపడుతున్న 180 జట్లు

తుని రూరల్: శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో మూడు రోజులపాటు జరిగే ఆంధ్ర, తెలంగాణ అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో 180 జట్లకు చెందిన రెండు వేల మంది బాలురు, బాలికలు పాల్గొంటున్నట్టు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లలో 24 జట్లు పాల్గొనగా 12 జట్లు విజేతలుగా నిలిచాయని ఆయన తెలిపారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ఖోఖో ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్ఎల్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదట రోజు విజేత జట్లు: అండర్-19 బాలికల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సిస్టర్స్ నివేదిత స్కూల్, ఏలూరుకు చెందిన సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఏలూరు, తిరుపతికి చెందిన వరిటాస్ సైనిక్ స్కూల్ జట్లు విజేతగా నిలిచాయి. అండర్-17 బాలికల విభాగంలో నాచారానికి చెందిన సుప్రభాత హైస్కూల్, బొమ్మార్సిపేటకు చెందిన శాంతినికేత్ విద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన భారతీయ విద్యాభవన్ జట్లు గెలుపొందాయి. అండర్-19 బాలుర విభాగంలో తిరుపతికి చెందిన ఎకార్డ్ స్కూల్, అండర్-17 బాలురు విభాగంలో బొమ్మార్సిపేటకు చెందిన శాంతి నికేతన్ విద్యాలయం, సిద్ధార్థ బోడుప్పల్‌కు చెందిన పబ్లిక్ స్కూల్ జట్లు గెలిపొందాయి. అండర్-14 విభాగంలో నర్సింగపాలేనికి చెందిన హిల్ స్కూల్, విజయవాడకు చెందిన శ్రీస్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్ జట్లు గెలుపొందినట్టు నిర్వాహకులు తెలిపారు.


ప్రారంభ మ్యాచ్‌లో ఖోఖో ఆడుతున్న బాలికల జట్లు